

# హైదరాబాద్ వార్త

# అమెరికాకు వెళ్లేవారు పెరుగుతున్నా డైరెక్ట్ ఫ్లైట్ ఏదీ ?



**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** నగరం నుంచి ప్రతి ఏటా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ)కు వెళ్లేవారు పెరుగుతున్నా డైరెక్ట్ ఫ్లైట్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నేరుగా విమానా సౌకర్యాలు లేకపోవడంతో హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లేందుకు ప్రయాణికులు ఇతర విమానాశ్రయాల కనెక్టింగ్‌తో కూడిన విమాన సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. నగరం నుంచి అమెరికాకు నేరుగా విమానాలు నడపాలని ప్రయాణికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. ఏటా 10 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నా శంషాబాద్‌లోగల రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికా వెళ్లడానికి డైరెక్ట్ ఫ్లైట్ లేదు. దీంతో ప్రయాణికులు అమెరికాలో ఎక్కడికి వెళ్లాలన్నా రెండు, మూడు విమాన సర్వీసులు మారాల్సి వస్తోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 55, 000మంది డొమెస్టిక్ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, మరో 10వేల మందికిపైగా అంతర్జాతీయ ప్రయాణికులు వివిధ దేశాలకు ప్రయాణం చేస్తున్నారు. దుబాయ్, సింగపూర్, మలేషియా, బ్రిటన్, దోహా, జెడ్డా, మాలే, థాయ్‌లాండ్, జర్మనీ తదితర దేశాలకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. కానీ అమెరికాకు మాత్రం అలాంటి సదుపాయం లేదు. అమెరికా ప్రయాణికుల్లో ఢిల్లీ, ముంబై తర్వాత హైదరాబాద్ మూడోస్థానంలో ఉన్నట్టు ఇంటర్నేషనల్ ఎయిర్‌ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. ఏటా సుమారు 10లక్షల మంది హైదరాబాద్ నుంచి అమెరికాకు రాకపోకలు సాగిస్తున్నారు. తెలుగురాష్ట్రాల నుంచి లక్షలాది మంది విద్యార్థులతోపాటు ఉద్యోగులు, వారి బంధువులు కూడా పెద్ద సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారు. అమెరికాలో స్థిరపడిన పిల్లల దగ్గరకు వెళ్లేందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రయాణాలు కూడా అత్యధికంగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబై నుంచి మాత్రమే అమెరికాకు డైరెక్ట్‌గా విమాన సర్వీసులు ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికుల్లో 60శాతం మంది అమెరికాకు వెళ్లేవారే ఉంటారు.

హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళుతున్న ప్రయాణికుల్లో ఎక్కువశాతం న్యూయార్క్, డల్లాస్, చికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో తదితర నగరాలకు వెళుతున్నారు. ప్రయాణికుల సంఖ్య కూడా ప్రతి సంవత్సరం పెరుగుతోంది. గతంలో ఎయిర్ ఇండియా చికాగోవరకు వారానికి రెండు సర్వీసుల చొప్పున నడిపింది. 350 సీట్లు ఉండే ఆ ఫ్లైట్‌కు ప్రయాణికుల నుంచి అనుహ్యమైన ఆదరణ లభించింది. 30శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. కోవిడ్ కాలం నుంచి ఆ సర్వీసులను నిలిపివేశారు. ఆ తర్వాత పునరుద్ధరిస్తామని ఎయిర్ పోర్టువర్గాలు చెప్పినా, ఇప్పటివరకు షికాగో ఫ్లైట్‌లు తిరిగి ప్రారంభం కాలేదు. కోవిడ్ అనంతరం రాకపోకలు మరింత ఎక్కువయ్యాయి. ఐఏటీఏ లెక్కల ప్రకారం కోవిడ్‌కు ముందు 2019లో 8.5లక్షల మంది ప్రయాణం చేయగా, కోవిడ్ కాలంలో రాకపోకలు నిలిచిపోయేనాటికి 2020లో 3 లక్షల మంది ప్రయాణం చేశారు. ఆ మరుసటి సంవత్సరం పూర్తిగా నిలిచిపోయాయి. ఆంక్షలు తొలగించి అంతర్జాతీయ రాకపోకలు పునరుద్ధరించిన తర్వాత ప్రయాణకుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. యూఎస్ నుంచి కొత్తగా వీసాలు లభించకపోయినా, అప్పటికే వీసాలు కలిగిఉన్న ప్రయాణికులంతా కోవిడ్ అనంతరం ఇరువైపులా పెద్దసంఖ్యలో ప్రయాణం చేశారు. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య 10 లక్షలకు చేరినట్టు అంచనా. హైదరాబాద్ నుంచి చికాగో వరకు నడిచిన ఎయిర్ ఇండియా సర్వీసులు పునరుద్ధరించినా ప్రయాణికులకు ఊరట లభిస్తుంది. శంషాబాద్ ఫ్లైట్ ఎక్కేసి నేరుగా షికాగోలో దిగిపోవచ్చు.



భక్తులతో కిటకిటలాడిన గోల్కొండ కోట

# గల్లీ గల్లీల్లోకి పోలీస్ పెట్రోలింగ్ విస్తరణ



**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** నగర పోలీసులు పెట్రోలింగ్‌లో నిరంతరం వినూత్న పద్ధతిని అవలంబిస్తూ వస్తున్నారు. ఇటీవలె వరస దోపిడీలు చేస్తూ వ్యాన్‌లో పారిపోతున్న పార్థా దొంగల ముఠాను తక్షణ సమాచారం అందడంతో పెట్రోలింగ్ పోలీసులు చాకచక్యంతో ఛేజ్ చేసి మరీ పట్టుకున్న విషయం తెలిసిందే. నగరంలో వివిధ ప్రాంతాల్లో భారీగా పెట్రోలింగ్ చేసే పోలీసులు వివిధ నేరాలపై నిరంతరం నిఘా వేసి ఉంటారు. ఈ క్రమంలో కఠినంగా వ్యవహరించిన పోలీసులు, తాజాగా సైకిళ్ళపై తిరుగుతూ పెట్రోలింగ్ చేశారు.

ఇటీవల 15 రోజుల్లోనే సుమారు పది వరకూ హత్యలు, దోపిడీలు జరిగాయి. చైన్, సెల్‌ఫోన్ స్నాచర్లను, దోపిడీ దొంగలను, ఆకతాయిలను కట్టడి చేయడానికి ఆంక్షలు విధిస్తూ పోలీసులు కఠినంగా వ్యవహరించారు. పలు సందర్భాల్లో నిందితులపై గన్ ఫైర్ చేశారు. ఈ క్రమంలో 'నో ఫ్రెండ్లీ పోలీస్., ఓన్లీ లాఠీ ఛార్జ్ పోలీస్' నినాదంతో పెట్రోలింగ్ జీపుల్లోని మైకుల్లో వచ్చే ప్రకటన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, రోడ్లపై అల్లర్లు సృష్టించడం వంటివి చేయద్దని హెచ్చరిస్తూనే, ద్విచక్రవాహనదారులను అనుమానాస్పద వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వద్దంటూ పెట్రోలింగ్ పోలీసులు తగు జాగ్రత్తలు సూచించారు. కాగా పాతబస్తీ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనంలోని మైకు నుంచి వచ్చిన ఈ ప్రకటన పలువురిని విస్మయానికి గురి చేయడంతో సోషల్ మీడియా ఎక్స్‌లో ప్రత్యక్షమైంది. ఐతే తాజాగా నేరాల నివారణపై అవగాహనా చర్యలో భాగంగా వివిధ కాలనీల్లోనూ, ఇరుకు సందుల్లోనూ కూడా పెట్రోలింగ్‌ను విస్తరించే క్రమంలో పోలీసులు సైకిళ్ళపై తిరుగుతూ వివిధ ప్రాంతాలపై నిఘా వేస్తున్నారు. రాచకొండ కమీషనరేట్ పరిధిలో ఆదిబట్ల పీఎస్ పోలీసులు సైకిళ్ళపై తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహించారు. స్థానిక టీసీఎస్ కేంపస్, కాలనీల్లో సైకిళ్ళపై వెళ్ళి ప్రజలతో మాట్లాడారు. వరుసగా జరిగే నేరాల పట్ల, ప్రజల భద్రత, తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల వారితో ముచ్చటించారు. నేర నివారణలో పోలీసులకు సహకరించాలని ప్రజలకు సూచించారు.

కాగా ఇటీవలె పోలీసులపై నేరస్థులు 3 సార్లు దాడి చేయబోయి వారి ప్రతిదాడికి లొంగిపోయారు. మొన్న జరిగిన పార్థా గ్యాంగ్ ఛేజ్‌లో రాచకొండ పోలీసులతో పాటు నల్గొండ సీసీఎస్ పోలీసులపై దొంగల ముఠా సభ్యులు కత్తులు దూసే ప్రయత్నం చేయగా పోలీసులు తుపాకులకు పని చెప్పాల్సొచ్చింది. ఇటీవలె నాంపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లోని మాంగర్ బస్తీకి చెందిన దుండుగలు పోలీసులపై రాళ్ళతోనూ, కొడవలితోనూ దాడికి దిగి, పోలీసుల కాల్పులకు గాయపడి లొంగిపోయారు. తాజాగా సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని నార్సింగి పోలీసులపై రియలెస్టేట్ రౌడీ మూకలు కత్తులు, హాకీ కర్రలతో దాడికి పాల్పడగా అదనపు బలగాలను దింపిన పోలీసులు దాడికి దిగిన నలుగురు నిందితులనీ పట్టుకున్నారు. ఈ క్రమంలో పెట్రోలింగ్‌కి పోలీసులు సైకిల్ ఎక్కడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి ఇరుకు సందులోకైనా సైకిల్ మీద దూసుకుపోయే సౌలభ్యమున్నాగానీ, కారులో పోలీసుల బలగాలు గస్తీ కాస్తాయనీ, దుండుగలు ఎదురు దాడికి దిగితే వారిని అదుపు చేయవచ్చునీ, సైకిల్ మీద పోలీసులకు ప్రతిదాడి కష్టమవుతుందనే సందేహాలు ప్రజల్లో ఉన్నాయి. పెట్రోలింగ్‌లో భాగంగా అమెరికా పోలీసుల వలె అత్యంత లగ్జరీ కారైన రోల్స్ రాయిస్‌ను హైదరాబాద్ పోలీసులు కూడా వాడచ్చు కదా అనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

## నేటి నుంచి హుస్సేన్ సాగర్‌లో మాన్‌సూన్ రేగట్టా పోటీలు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** నేటి నుంచి హుస్సేన్ సాగర్‌లోని సెయిలింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, హైదరాబాద్ యాచ్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధికారులు ప్రకటించారు. గత ఏడాది తెలంగాణకు చెందిన దీక్షిత కొమరవెల్లి సెయిలింగ్ పోటీల్లో టాప్ సీడ్‌గా నిలువగా, తమిళనాడుకు చెందిన శ్రేయా కృష్ణన్ రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. కాగా ఈ ఏడాది రేగట్టాపోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రికార్డు స్థాయిలో పాల్గొనున్న 140మంది నావికులకు రుతుపవనాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. వీరిలో 40 శాతం మంది నావికులు తెలంగాణ వాసులే అవ్వడం విశేషం. ఈ సారి పోటీల్లో మరో మూడు కొత్త బోట్లను కూడా చేర్చినట్లు తెలుస్తోంది. ఐపిఎల్ సీఏ4, 29 ఈఆర్, ఇంటర్నేషనల్ 420 పేర్లతో కొత్త పడవలను చేర్చారు. షిల్లాంగ్‌లో నేషనల్స్ గెలిచిన బాల విజేతలకు గోవర్ధన్ పల్లారా నాయకత్వం వహించనున్నారు. అండర్ 18 లేజర్ క్లాస్‌లో మధ్యప్రదేశ్, గోవా జట్ల మధ్య గట్టి పోటీ నెలకొనగా, అండర్ 19 మిక్స్‌డ్ క్లాస్‌లో తెలంగాణకు చెందిన టాప్‌సీడ్ వైష్ణవి వీరవంశం, శ్రావణ్‌కత్రావత్ ఆధిపత్యం వహిస్తున్నారు.

# పోటెత్తిన భక్తజనం



- శ్రీజగదాంబిక అమ్మవారికి మూడవ పూజ.
- భక్తులపై లాఠీ ఝుళిపిన పోలీసులు.
- రహదారులన్ని ట్రాఫిక్‌మయం.
- జాడలేని దేవాదాయశాఖ అధికారులు.

**మెహిదీపట్నం, జూలై 14, ప్రభాతవార్త :** గోల్కొండ కోట భక్తజనంతో పోటెత్తింతి. ఎటు చూసినా భక్తజన సందోహమే. ఆషాడమాస బోనాల ఉత్సవాలలో భాగంగా గోల్కొండ కోటలో కొలువైన శ్రీజగదాంబిక అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. ఆదివారం అమ్మవారికి మూడవ పూజను నిర్వహించడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలువురోజు కావడంతో నగరం నలు మూల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తుల లక్షలాదిగా తరలిరావడంతో కోట పరిసరాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. మూడవ పూజ సందర్భంగా అమ్మవారికి నగరంలోని 25 బస్తీల నుంచి భారీ తొట్టెలను తీసుకొచ్చి సమర్పించడంతోపాటు ప్రత్యేక పూజలు, బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. బిజెపి గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్‌ల ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లోని బుజిలి మహంకాళి దేవాలయంవద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్దకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణారెడ్డి హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక నేతలు ఆయనకు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు.

**భక్తులపై లాఠీ ఝుళిపించిన పోలీసులు.**

గోల్కొండ కోటకు లక్షలాదిగా భక్తులు తరలి రావడంతో కోట ఆవరణలో తోపులాట జరిగింది. దీంతో పోలీసులు భక్తులపై లాఠీ ఝుళిపించారు. అదివారం సెలవు రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కోట పరిసరాలలో భక్తులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడంతోనే తోపులాట జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు పుట్ట వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా లాఠీచార్జ్ చేయగా. శివసత్తులను సైతం పోలీసులు కొట్టడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రహదారులన్ని ట్రాఫిక్‌మయం.**

గోల్కొండ కోటకు వచ్చే రహదారులన్ని ట్రాఫిక్‌తో నిండిపోయాయి. దీంతో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. జగదాంబిక అమ్మవారికి మూడోపూజ సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలివస్తారని ముందే అంచనా వేసిన అధికారులు గోల్కొండ పరిసర ప్రాంతాలతోపాటు గోల్కొండకు వచ్చే రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. రాందేవ్‌గూడ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను మఖై దర్వాజ వద్ద ఉన్న మిలటరీ గ్రౌండ్‌లో కార్లు, ఆటోలు పార్కు చేయగా, బైక్‌లను అషూర్ ఖాన్ దర్గా నుంచి గోల్కొండ కోట గోడ వరకు పార్క్ చేశారు. లంగర్‌హౌస్ నుంచి ఫతేదర్వాజ మీదుగా వచ్చే భక్తుల ఆటోలు, కార్లను, అలంకార్ థియేటర్, ఓల్డ్ పెట్రోల్ బంక్ వద్ద, బైక్‌లను హుడా పార్క్‌లో నిలిపారు. షేక్‌పేట నుంచి 7 టూంబ్స్ మీదుగా వచ్చే భక్తులు, బంజారా దర్వాజా నుంచి కోటకు వచ్చే భక్తుల ఆటోలు, కార్లను దక్కన్ పార్కులో, బైకులను గోల్ఫ్‌క్లబ్‌లో పార్కు చేశారు. అంచనాలకు మించి భక్తులు తరలి రావడంతో గోల్కొండ రహదారులన్ని ట్రాఫిక్‌తో నిండిపోయాయి.

**జాడలేని దేవాదాయశాఖ అధికారులు...**

గోల్కొండ బోనాల ఉత్సవాలలో దేవాదాయ శాఖ అధికారులు జాడలేకుండా పోయారు. బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండ కోటలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గొప్పలు చెప్పిన ప్రజా ప్రతినిధుల, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. ఆషాడమాస బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండ కోటకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అధికారులకు ముందే తెలిసినా తగిన ఏర్పాట్లు చేయడంతో పూర్తిగా విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ మల్లింపులోనూ, కోటపై తగిన ఏర్పాట్లు చేయక పోవడంతో భక్తులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోటపై భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



భక్తులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

## డార్క్ వెబ్‌లో కొత్తగా రిపోర్ట్ ఫీచర్

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:**

ఆన్‌లైన్ మోసాలు అరికట్టడం కోసం, ఖాతాదారుల భద్రత కోసం గూగుల్ సంస్థ కొత్త నిర్ణయం తీసుకుంది. డార్క్ వెబ్ రిపోర్ట్ అనే ఫీచర్‌ను ఖాతాదారులందరికీ అందుబాటులోకి తీసుకురానుంది. గతంలో గూగుల్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి మాత్రం డార్క్ వెబ్ రిపోర్ట్ అనే ఫీచర్‌ను అందుబాటులో ఉంచిన గూగుల్, తాజాగా సైబర్ దోపిడీలు పెరిగిపోతున్న నేపథ్యంలో గూగుల్ ఖాతాదారులందరికీ ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీస్కొస్తున్నట్లు ప్రకటించింది. ఎందరికో తమ ఫోన్, లేదా ల్యాప్‌టాప్ హ్యాకయిందో లేదో వివిధ యాప్‌ల ద్వారా, అంతర్గత ఫీచర్ల ద్వారా తెలుసుకోవడం సాధ్యపడుతున్న సందర్భంలో, తమ వ్యక్తిగత ఆధారాలు డార్క్ వెబ్‌లో ఉన్నాయో లేవో తెలియడం కష్టమైంది. ఖాతాదారులకు సంబంధించిన ఈ మెయిల్ అడ్రస్, ఫోన్ నెంబరు, పేరు, చిరునామా, వివిధ ఖాతాల యూజర్ నేమ్‌లు, పాస్‌వర్డ్‌లు, సోషల్ సెక్యూరిటీ నెంబర్ వంటి వివరాలు, అడ్రస్ ప్రూఫ్‌లు, ఇతర ఐడెంటిటీలను స్కాన్ చేసిన వివరాలు డార్క్ వెబ్‌లో రహస్యంగా ఉంటున్నాయి. ఇవన్నీ వివిధ జిరాక్స్ షాపులు, ఇంటర్‌నెట్ కేఫ్‌లు, ఇతర మాధ్యమాల నుంచి బయటకు వెళ్ళి చివరికి తమ ప్రమేయం లేకుండా డార్క్ వెబ్‌లోని హ్యాకర్ల చేతికి చిక్కుతున్నాయి. ఈ క్రమంలో గూగుల్ అందించే డార్క్ వెబ్ రిపోర్ట్ అనే ఫీచర్ ద్వారా ప్రజలు తమ తమ వ్యక్తిగత వివరాలు, ఆధారాలు డార్క్‌వెబ్‌లో ఉన్నాయో లేవో తెలుసుకోవడం ద్వారా సైబర్ మోసాలకు గురి కాకుండా జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

### ఆషాడ బోనాల జాతరకు రావాలంటూ మంత్రి పొన్నంకు ఆహ్వానం

**బేగంపేట, జూలై 14 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయ ఆషాడ బోనాల జాతరకు రావాలంటూ హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభా కర్‌ను శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు వేణుమాధవశర్మ అర్చకులు వెళ్లి ఆదివారం ఆహ్వానించారు. సికింద్రాబాద్ శ్రీఉజ్జ యినీ మహాకాళీ ఆషాడ బోనాల జాతరకు రావా లంటూ ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు.

## డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

### మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

**ధర్నాచౌక్, జూలై 14, ప్రభాతవార్త:**

నగర శివారు ప్రాంతాలలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో తక్షణమే సదుపాయాలు కల్పించి, లబ్దిదారులకు స్వాధీనం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కే.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిధిగా హాజరై నాగేశ్వర్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాలలో మంచినీటి వసతి, విద్యుత్తు, రోడ్లు లేనందువల్ల ఇళ్లు పొందిన పేదలు ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. కనీస సదుపాయాలు కల్పించటానికి దాదాపు 700 కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయని జీహెచ్‌ఎంసీ, హౌసింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు కాబట్టి రాష్ట్ర బడ్జెట్‌లో ఈ నిధులకు ప్రాధాన్యత నిచ్చి, పేదలకు ఇళ్లను అందచేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేసిన కారణంగా ఎన్నికలు సమీపిస్తున్నందున హడావిడిగా లబ్దిదారులకు ఇళ్లను మాత్రం కేటాయించారని, కానీ కనీస వసతులు కల్పించలేదని ఆరోపించారు. కనీస సౌకర్యాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, లేనిపక్షం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం ముషీరాబాద్ కార్యదర్శి ఎం.దశరథ్, ఎం.మహేందర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కార్యదర్శి కే.నాగలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.విజయకుమార్, వివిధ ప్రాంతాల లబ్దిదారులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

# కాటేస్తున్న కల్తీ పాలు..!

**కల్తీ పాలతో పసిపిల్లల్లో తగ్గుతున్న ఎదుగుదల... మొద్దునిద్రలో డెయిరీ నాణ్యత నియంత్రణ విభాగం**

**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** పాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఒక పక్క వైద్యులు చెబుతుండగా, కాని వీటిలో కల్తీ తీవ్రం కావడంతో అనారోగ్యంతో గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆరోగ్యం కోసం పాలు తాగాలని వైద్యులు చెబుతుంటే, ప్రస్తుతం కల్తీ ఎక్కువ కావడంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా చిన్న పిల్లలకు, లోకం తెలియని పసికందులకు కూడా ఈ కల్తీ, విషరసాయనాల పాలను తాగించే పరిస్థితి రావడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ విష రసాయనాల పాలను తాగితే పిల్లల్లో హార్మోన్ల సమతుల్యత లోపించడంతో పాటు ఆడవారిలో గర్భదార శక్తి, మగవారిలో పునరుత్పత్తి అవకాశాలు తగ్గిపోతాయని వైద్యులు చెబుతున్నారు. రైతుల వద్ద పశువుల పాకల్లో అపరిశుభ్రత వల్ల వీధి వ్యాపారుల పాలు కల్తీ చేయడం ఒక ఎత్తైతే... టోకుగా ట్యాంకర్ల కొద్ది విక్రయించే డైయిరీల్లో సైతం పాడైన పాలను విక్రయాలకు పంపుతున్నారు. కల్తీ పాలని గుర్తించి గుర్తించి ట్యాంకర్లను వెనక్కి పంపితే నేరుగా మార్కెట్‌లోకి తీసుకెళ్లి యధేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజారోగ్యాన్ని గాలికొదిలి ముఖ్యంగా చిన్న పిల్లలకు, లోకం తెలియని పసికందులకు ఇలా కల్తీ పాలు విక్రయిస్తుండడంతో ఇలాంటి దారుణాలను అరికట్టడానికి పటిష్టమైన యంత్రాంగం లేకపోవడానికి కల్తీకి ప్రధానకారణంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో పాల కల్తీని అరికట్టేందుకు పటిష్టమైన ప్రభుత్వ యంత్రాంగం లేకపోవడంతో ప్రజారోగ్యం కాపాడడం ఇబ్బందికరంగా మారింది. ఆహారభద్రతా చట్టం ప్రకారం పాలల్లో నీటిని సహా ఏమి కలిపినా నేరం. అందుకు బాధ్యులైన వారిని ప్రభుత్వం శిక్షించాలి. అయినా నీటిని మొదలుకుని ఏకంగా విషపూరిత రసాయనాలు సైతం కలిపి ప్రజలకు విక్రయిస్తున్నారు. కొందరు చిన్నవ్యాపారులు దురాశతో ఏకంగా యూరియాతో కృత్రిమ పాలను కలిపి హోటళ్ళకు, ఇళ్లలో అమ్ముతున్నారు. అలాగే పరిశ్రమలు వదిలే అత్యంత విషపూరిత రసాయనాలతో మూసీ జలాలు కలుషితమవుతున్నాయి. ఇవే జలాల్లోకి నిత్యం పాడి పశువులను తొలుతుంటారు. ఆ నీటిని తాగే పాడి గెదెలు ఇచ్చే పాలలో స్వచ్ఛత ఉండదు. మూసీ మురుగులో తిరిగే గేదెల కారణంగా సైతం పాలు కల్తీ అవుతున్నాయి. ఈ మురుగులో తిరిగి వచ్చిన గెదె పొదుగును వేడినీళ్ళతో శుభ్రం చేయకపోతే అక్కడుంటే బ్యాక్టీరియా, రసాయనాలు నేరుగా పాలు పిండే సమయంలో కలుస్తాయి. సాధారణంగా ప్రతి పెద్దడెయిరీలో నాణ్యత నియంత్రణ విభాగం ఉంటుంది. డెయిరీకి వచ్చే పాల నాణ్యతను విధిగా తనిఖీ చేసిన తర్వాత అమ్మకాలకు అనుమతించాలి. కానీ ఇప్పటివరకు ఏ పెద్ద డెయిరీ వారు సైతం నెలకు ఎన్ని పాలను సేకరించాలి, నాణ్యత లేక ఎన్ని లీటర్లను తిరస్కరించారనే వివరాలను ప్రజలకు వెల్లడించే పరిస్థితి నేటికి కనిపించలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంయుక్తంగా 'విజయ' పాల డెయిరీకి హైదరాబాద్‌లోని లాలాపేటలో ప్రధాన ప్లాంట్ ఉంది. ఇక్కడికి నిత్యం లక్షలాది లీటర్ల పాలు ట్యాంకర్లలో వస్తున్నాయి. వీటి నాణ్యతను పరీక్షించి ప్యాకింగ్‌కు పంపుతున్నారు.

ట్యాక్లర్లలో నమూనాలను తీసుకుని నాణ్యత విభాగానికి పంపి పరిశీలించి అనేక పలు రకాల కల్తీ వ్యవహారాలు నిర్ధారణకు వస్తే..ఆ నాసిరకం పాలు తెచ్చారనే కారణంగా ట్యాంకర్లను తిరస్కరిస్తే అవే పాలను తెచ్చినవారు తిరిగి తీసుకెళ్లి బయట అమ్ముతున్నారని డెయిరీ అధికారులు తెలుపుతున్నారు. ఆ ట్యాంకర్లను తిరిగి తీసుకెళ్లి ఎక్కడ అమ్ముతున్నారనేది తెలియడం లేదని సదరు అధికారులు తెలుపుతున్నారు. ఇలా కల్తీవని గుర్తించిన పాలను బయట ఎక్కడా అమ్మకుండా పారబోయాలి, కాని అలా ఎప్పుడు జరగడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కల్తీ పాలను కొందరు పాలను అమ్ముకోకపోతే నష్టపోతామని వాటిని హోటళ్ళు, ఇతర వ్యాపార అవసరాలకు టోకుగా అమ్ముతున్నారు. అదే విధంగా ప్యాకేట్‌లోని పాలను ఏ తేదీలోగా ప్రజలు వాడాలో తెలుపుతూ స్పష్టంగా ప్యాక్‌పై ముద్రించాల్సి ఉండగా, షాపులో ఉన్న తేదీనే ప్యాకెట్లపై ముద్రించి ఉంటుంది. అంటే ఆ ప్యాకెట్లలోని పాలను అదే రోజు వాడాలి లేదా మరుసటి రోజు పారబోయాలి. ఫ్రీజ్‌లో ఉంచుకుని మరుసటి రోజు వాడినా ప్రమాదమేనని డెయిరీ అధికారులు తెలుపుతున్నారు. ఏ డెయిరీ పాల ప్యాకేట్ కొన్నా ప్రజలెవరూ పొరపాటున కూడాపచ్చిపాలు తాగరాదు. బ్యాక్టీరియా అధికంగా ఉంటున్నందున నేరుగా కడుపులో ప్రభావం పడుతుంది. బాగా మరిగేలా కాచిన తర్వాతే తాగాలి. సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మర్నాడు వాడకూడదు. పాలను ఎక్కువగా రసాయనాలతో కల్తీ చేస్తున్నందున ప్రజలు తేదీ చూసి కొనాలని డెయిరీ అధికారులు చెబుతున్నారు. కొందరికి కల్తీ చేయడం అలవాటుగామారిందని, కొందరు కేవలం పాలను ప్యాకింగ్ చేసి కూడా అమ్ముతున్నారు. దీని ఎదుర్కొవాలంటే ప్రజల్లో చైతన్యం రావడంతో పాటు పాలప్యాకేట్ ఖరీదు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకుని ఖరీదు చేయాలని చెబుతున్నారు.

**కల్తీపాలు తాగితే పిల్లల ఎదుగుదల తగ్గుతుంది**

**డాక్టర్ రంగయ్య**

కల్తీపాలు తాగితే పసి పిల్లల్లో ఎదుగులదల తగ్గడంతో పాటు అధికంగా పెరగడం వంటి అసాధారణ లక్షణాలు కనిపిస్తాయి. కొంతమంది పిల్లలు అసలు పాలు తాగడం లేదని ఆసుపత్రికి తీసుకువస్తున్నంటారు, వారు కల్తీపాలు తాగినప్పుడు కడుపులోవచ్చే మార్పుల గురించి వివరంగా చెప్పలేక తాగడానికి విముఖ చూపుతుంటారు. పసి వయస్సు నుంచే కల్తీ పాలు తగిన పిల్లల ఎదుగుదలలో లోపాలు వల్ల పెద్దయ్యాకా సైతం అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. పాలలో గంజిపొడి, డిటర్జెంట్ల సోడా వంటివి కలిపి కల్తీ చేస్తున్నారు. వీటిని తాగే పిల్లల్లో జీర్ణక్రియ మందగించడమే కాకుండా, కిడ్నీలు, గుండె వ్యాధులకు గురవుతుంటారు.

## 'డెంగీ'పై అవగాహన పెంచుకోవాలి

**సైఫాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** వానాకాలం లో సీజనల్ జ్వరాలు తరుచూ వస్తుంటాయని, పైకి అన్ని జ్వరాలు ఒకేలాగా ఉన్నా డెంగీ ఫీవర్ లక్ష ణాలు వేరుగా ఉంటాయని, డెంగీ వచ్చినప్పుడు తీసుకోవాల్సి న ట్రీట్మెంట్, జాగ్రత్తలు వేరుగా ఉంటాయని, డెంగీ జ్వరం గురించి కొద్దిగా అవ గాహన పెంచుకుంటే తప్పించుకోవడం సులభం అవుతుందని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ పట్టణ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి చెప్పారు.డయాబెటిస్‌తో బాధ పడు తున్నవారికి, వృద్ధులు, చంటిపిల్లలకు ఇమ్యూనిటీ డిసీజ్‌లు ఉన్నవాళ్లకు డెంగీతో ఎక్కువగా ప్రమాదం ఉంటుందని తెలిపారు.అందువల్ల వీరంతా మరింత జాగ్రత్తగా ఉండాలని, పిల్లల్లో జర్వం లేకుండానే డెంగీ వస్తుందని, ఈ సీజన్‌లో పిల్లల ఆరోగ్యాన్ని ఒక కంట గమనిస్తుండాలని, కాస్త నలతగా అనిపిస్తే వెంటనే రక్త పరీక్ష చేయించడం మంచిదని, అలాగే ఒకసారి డెంగీ వచ్చిన వ్యక్తికి మళ్లీ డెంగీ వస్తే తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరిం చారు. ఆరోగ్యకేంద్రంలో డెంగీపై పిల్లల తల్లిదండ్రు లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సంద ర్భంగా ఆయన మాట్లాడారు. డెంగీ అనేది ఒక వైరల్ వ్యాధి డెంగీకి మూలమైన ఫ్లేవీ వైరస్‌లు దోమ నుంచి శరీరంలోకి చొరబడతాయని, అందుకే డెంగీ రాకుండా అడ్డుకోవా లంటే ముందుగా దోమల నుంచి తప్పించుకోవాలని, ఒకప్పటిలాగా స్ప్రేలు, లిక్విడ్‌లతో దోమలు కంట్రోల్ అవ్వడంలేదని, అవి వాటిశక్తిని పెంచుకున్నా యని, వాటిని అడ్డుకోవడంలో మనం అప్‌డేట్ అవ్వాలని చెప్పారు. అందువల్ల డెంగీ రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని డాక్టర్ సూచించారు.

## రాష్ట్రంలో గ్రంథాలయాల పూర్వవైభవానికి కృషి

### చైర్మన్ డాక్టర్ రియాజ్



డాక్టర్ రియాజ్‌ను సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్

**చిక్కడపల్లి, జూలై 14ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఆ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ మహ్మద్ రియాజ్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ ఆధ్వర్యంలో పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ రియాజ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోని గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు,పెన్షనర్లకు సాలరీ గ్రాంట్ కింద ప్రభుత్వమే జీతాలు పెన్షన్స్ చెల్లిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోమ శివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, కార్యదర్శి ఆదం రఫీతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గ్రంథాలయ సంస్థ పెన్షనర్‌లు, తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

### -గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయకుమార్

**చిక్కడపల్లి, జూలై 14 ప్రభాతవార్త:** 'నేను మా అమ్మ పేరుతో మొక్క నాటాను-ప్రతి ఒక్కరు తల్లులను గౌరవించేలా ఒక మొక్కను నాటండి' ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరు గౌరవించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ తన మాతృమూర్తి పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్‌తో కలిసి నిర్వహిం చారు. అందరు విధిగా మొక్కలు నాటడం ద్వారా తల్లి లాంటి ప్రకృతిని కాపాడిన వారౌతారని, ఇది మనందరి బాధ్యత అని, భావితరాలకు మను గడ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్, చంద్రకళ, సుధా, నగధర్, మురళీ, రామకృష్ణ, సుధాకర్, రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రచయిత్రి శైలజామిత్ర కథల సంపుటి ఆవిష్కరణ



'వష్టి' కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న సయ్యద్ సలీమ్,

**చిక్కడపల్లి, జూలై 14 ప్రభాతవార్త:** రచయిత్రి శైలజామిత్ర కథల్లో చక్కని భావం, శిల్పం ఉన్నాయని సాహిత్య అకాడమి అవార్డుగ్రహీత సయ్యద్ సలీమ్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని గుండ వరపు హన్మంతరావు కళావేదికలో లేఖిని రచయిత్రుల వేదిక, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రఖ్యాత రచయిత్రి శైలజా మిత్ర రచించిన 'వష్టి' కథల సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు, ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సయ్యద్ సలీమ్ మాట్లా డుతూ సమాజపరంగా ఎంతో అవసరమైన కథలు రచయిత్రి శైలజామిత్రా రచించారని, కథా రచనలో తమదైన ఒకప్రత్యేక ముద్ర ఉందని అభిప్రాయ పడ్డారు. ప్రముఖరచయిత్రి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి మాట్లా డుతూ శైలజామిత్ర రచించిన చాలా కథలు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉన్నాయన్నారు. అత్తలూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా శైలజా మిత్ర రచనాపరంగా ఎంతో ఉన్నతంగా, ఎత్తుకు ఎదిగారని అన్నారు. ప్రముఖ రచయిత్రులు కస్తూరి అలివేణి, కరవది సరస్వతి, షామీర్ జానకీ దేవి గ్రంథాన్ని విపులంగా సమీక్షించారు. వీణా మునిపల్లి స్వాగతం పలుకు గా కుసుమా ఉప్పలపాటి చక్కని ప్రార్థనా గీతంతో సభను అలరించారు. రచయిత్రి శైలజామిత్రా స్పందనను తెలిపారు. కృతి స్వీకర్త సత్యమిత్ర మాట్లాడుతూ శైలజామిత్రా పట్ల తెలిపిన చక్కని విషయాలు, పాడిన పల్లవులు విశేషంగా ఆకట్టుకున్నాయి. హనిష స్వాగతం, వందన సమర్పణ చేశారు.

## రాష్ట్ర గాండ్ల మహిళా కార్యవర్గ సమావేశం

**తార్నాక, జూలై 14 ప్రభాతవార్త:** రాష్ట్ర గాండ్ల మహిళా సమావేశాన్ని డా.సుంకరనేని నగావాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గాండ్ల మహిళలు పాల్గొన్నారు. గాండ్ల కార్పోరేషన్‌ను సాధించుకునేందుకు అందరు ఐక్యమత్యంగా ఉండాలని మహిళలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గాండ్ల మహాళా సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గాండ్ల మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలుగా డా. సుంకరనేని నాగవాణి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా రేణుక సంగారెడ్డి, గౌరవ సలహాదారులుగా బి. హిమబిందు, గౌరవ అధ్యక్షురాలిగా పూసపల్లి సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా గండ్లా అనురాధ, కర్యానిర్వాహక ప్రధాన కార్యదర్శిగా కన్యాకుమారి, జిల్లా కోషాధికారిగా నిఖిత, ఉపాధ్యక్షులుగా పబ్బపద్మ, సి.అనురాధ, మంజుల, అరుంధతి, నిర్మల, సంయుక్త కార్యదర్శిగా మాధురి, ఉమారాణి, సంగీత, చందుల రజిత, సహాయ కార్యదర్శిగా అవంతి, విజయలక్ష్మి, శోభ, గుణవతి, ఈశ్వరమ్మ, ప్రచార కార్యదర్శిగా సునిత, గాయత్రి, రాధిక తది తరులను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షురాలు డా. నాగమణి, ప్రధాన కార్యదర్శి గాండ్ల అనురాధ మాట్లాడుతూ గాండ్ల కుల వృత్తిని పెంపొందించుకునే దిశగా కృషిచేస్తామన్నారు. వెనుక బడిన గాండ్ల కులాభి వృద్ధి కోసం కృషి చేయాల్సి న అసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జూపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు చెన్నాకర్, యాదగిరి, రవీందర్, కృష్ణ మూర్తి, శివశంకర్, ఉమామహేశ్వర్, ఇ.కిషన్ పాల్గొన్నారు.

# దివ్యాంగుల్లో వెలుగులు నింపాలి

### రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



దివ్యాంగులకు వీల్‌చైర్‌లు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్. చిత్రంలో కొల్లి నాగేశ్వరరావు తదితరులు

**చిక్కడపల్లి, జూలై 14 ప్రభాతవార్త:** సమాజసేవకు ప్రతి ఒక్కరు ముందుండాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో కాస్మోపాలిటన్ ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ వెంకటేశ్వరరావును సత్కరించగా సేవా కార్యక్రమంలో భాగంగా ఆరుగురు దివ్యాంగులకు వీల్‌చైర్‌లను పంపిణీ చేయగా, మరో పది మంది అంందులకు చేతి కర్రలను పంపిణీ చేసే కార్యక్రమం అఖిలభారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతి ఒక్కరు తోడ్పాటును అందించాలని అన్నారు. ఈ వర్గాల హక్కుల కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెచ్చినటువంటి 'దివ్యాంగుల హక్కుల చట్టం'ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. కాస్మోపాలిటి అసోసియేషన్ చేసఉునతన్న సేవలను కొనియాడారు. గత మూడు సంవత్సరాలుగా ఓ డాక్టర్‌ను ఎంపిక చేసి రూ.10వేలతో అవార్డును ఇవ్వడం విశేషమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అనీల్‌కుమార్, గౌరవ సలహాదారు గోపాలకృష్ణమూర్తి, సిఇసిఎ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, వెంకటేశ్వర్లు, ఇంద్రశేఖర్‌రెడ్డి తదితరులతో పాటు వికలాంగులు పాల్గొన్నారు.

### నగరంలో తొలిసారిగా

## 'దేవిశ్రీ ప్రసాద్ లైవ్ షో'

**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తొలిసారిగా నగరంలో లైవ్‌మ్యూజిక్ షో నిర్వహించనున్నట్లు ప్రకటిం చారు. ఈ సందర్భంగా ఆయన జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. గత పాతికేళ్ళుగా సంగీత ప్రపంచంలో ఎన్నో విజయాలు సాధించానని, త్వరలోనే తాను నిర్వహించబోయే ఈ లైవ్‌షోల ద్వారా మరింత మందిని ఉత్సాహపరుస్తాన న్నారు. దేశవ్యాప్తంగా ఈ లైవ్‌షోలు నిర్వహించబోతున్నట్లు, హైదరాబాద్ నుంచి మొదలు పెట్టానన్నారు. అద్భుతమైన లైటింగ్, జోష్ నింపే పాటలతో ఈ మ్యూజిక్‌షోలను డిజైన్ చేస్తున్నటుట్లు తెలిపారు. తాను ఇప్పటివరకు వివిధ దేశాలోన్ల లైవ్ ప్రదర్శనలు ఇచ్చానని, ఇక మన దేశంలో కూడా వివిధ రాష్ట్రాలలో ఈ షోలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిఎస్పీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మ్యూజిక్ ఈ యేడాది అక్టోబరు 19న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించబోతున్నామని, సంగీతం మాత్రమే కాకుండా ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించబోతున్నట్లు తెలిపారు.

## నేడు 'ప్రపంచ యువజన నైపుణ్య' దినోత్సవం

**చిక్కడపల్లి, జూలై 14ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో సోమవారం 'ప్రపంచ యువజన నైపుణ్య' దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు వివరించారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారాభవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ సలహాదారు మహ్మద్ ఆలీ షబ్బీర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్, శాసనమండలి సభ్యులు సురభివాణిదేవి, ఎంఎస్.ప్రభాకర్,మీరా రెహ్మత్ బేగ్ ఖాద్రీ, సాట్స్ చైర్మన్ కె.శివరామ్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.రమేశ్‌రెడ్డి, రాష్ట్ర యువ జన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్యకార్యదర్శి ఎ.వాణిప్రసాద్, కార్పొరేటర్ కవితా గోవర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. అనంతరం సెట్విన్‌లో నూతనంగా ప్రవేశపెట్టబోయే కొత్త కోర్సులను, ఆన్‌లైన్ తరగతులకు సంబంధించి రూపొందించిన వెబ్‌పోర్టల్‌ను ప్రారంభిస్తారన్నారు. సెట్విన్, పర్యావరణ పరిరక్షణ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసే ప్రదర్శనలను అతిథులు తిలకిస్తారని, ఈ ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ చేనేత వస్త్రాలు పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట, గొల్లభామ చీరలను ఉపయోగించి సెట్విన్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థినులచే సంప్రదాయ ఫ్యాషన్‌షోతో పాటు సెట్విన్ బ్యూటిషియన్ విద్యార్థులచే బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షో కూడా ఉంటుందని అన్నారు. అనంతరం వివిధ కోర్సులలో శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా సర్టిఫికేట్లు అందించడం జరుగుతుందన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

**జగద్గిరిగుట్ట, జూలై 14, ప్రభాతవార్త :** 126 జగద్గిరిగుట్ట డివిజన్ కూన మహాలక్ష్మీ నగర్ నందు ఆదివారం నిర్వహించిన రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ శక్తికి స్వరూపం అమ్మవారు అని, అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని కోరారున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాకయకులు హజ్రత్ అలీ, అజం, మహేందర్, బ్రహ్మానంద చారి, నాని, ప్రభాకర్, దాసు, విఠల్, మనోజ్, మజ్జి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, ఎర్ర లక్ష్మయ్య, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

### రసరమ్యం-ముగ్ధమనోహరం

## నిత్యశ్రీ భరతనాట్య అరంగేట్రం

**నాంపల్లి, జూలై 14 ప్రభాతవార్త :** ప్రఖ్యాత నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత పసుమర్తి రామలింగశాస్త్రి శిష్యురాలు, రమేష్ స్వప్నల తనయ బి.నిత్యశ్రీ భరతనాట్య ఆరంగేట్రం రసరమ్యం, ముగ్ధమనోహరంగా సాగింది. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆదివారం రాత్రి 7గంటల నుండి చిన్ననాటి నుండి భరతనాట్యం కళపై ఎంతో ఆసక్తితో గురువు రామలింగశాస్త్రి వద్ద సంపూర్ణ శిక్షణపొందిన నిత్యశ్రీ విద్యతోపాటు క్రీడల్లోనూ గొప్పగా రాణించడం విశేషం. ఈనాటి తన భరతనాట్య ఆరంగేట్రంను పుష్పాంజలి, గణపతిస్తుతితో ప్రారంభించి జతిస్వరం, శబ్దం, స్వరజతి, కీర్తన, తిల్లానా అంశాలను శృతి లయబద్ధంగా, అద్భుత హావభావాలను ప్రదర్శించి మంగళంతో ముగించి అశేష కళాప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకుల ప్రశంసలు, శుభాశీస్సులు అందుకుంది. గురువు పసుమర్తి రామలింగశాస్త్రి నట్టువాంగం, మృధురవళి గాత్రం, ఎం.చంద్రకాంత్ మృదంగం, కె.సాయికుమార్ వయోలిన్, ఉమా వెంకటేశ్వర్లు వేణువు, వి.శ్రీధరాచార్య ఘట్టంలతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథులుగా కళాకారిణి నిత్యశ్రీని, గురువు రామలింగశాస్త్రిని ఘనంగా సత్కరించి నిత్యశ్రీ గొప్పకళాకారిణిగా పేరుప్రఖ్యాతులు పొందాలని ఆకాంక్షించి శుభాశీస్సులు అందజేశారు.



నిజాంపేటనలో కురుస్తున్న వర్షం

## నగరంలో దంచికొట్టిన వాన

**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** నగరంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి మేఘావృతమై ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. రోడ్లపై వర్షం నీరు చేరడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వరద ప్రవాహానికి యూసుఫ్‌గూడలోని శ్రీకృష్ణనగర్‌లో ఓ కారు కొట్టుకుపోయింది.లోతట్టు ప్రాం తాలు జలమయమయ్యాయి. మయాపూర్, చందానగర్, లింగంపల్లి, కేపీ హెచ్‌బీ కాలనీ, బాచుపల్లి, ప్రగతినగర్, కూకట్‌పల్లి, మూసాపేట,బాలానగర్, కొండాపూర్, హైదర్‌నగర్, మల్కాజిగిరి, కుషాయిగూడ, దమ్మాయిగూడ, చర్ల పల్లి, కీసర, నిజాంపేట, నేరేడ్‌మెట్, అమీర్‌పేట్, ఈఎస్ఐ ఎర్రగడ్డ, సంతోష్ నగర్, బోరబండ, పంజాగుట్ట, జూబ్లీహిల్స్,బోడుప్పల్, రామంతాపూర్, మేడి పల్లి, పీర్జాదిగూడ, నఆంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, దుండిగల్, అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, ముషీరాబాద్, దోమల్‌గూడ,సికింద్రాబాద్, అల్వాల్, తిరుమల్‌గిరి తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, మరో రెండు రోజులు హైదరాబాద్ నగర వ్యాపనతంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## సిఎం రేవంత్‌రెడ్డి గురుకులాలపై దృష్టి సారించాలి

### బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ

**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** సమస్యల సుడిగుండంలో ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలపై దృష్టి సారించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆది వారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ పేద విద్యార్థులు చదువుకునే గురుకులాల అద్దె భవనాలు, రేకులు, కోళ్ల ఫారాల షెడ్‌లల్లో కొనసాగిస్తునాయన్నారు. నిర్వాహణ సరిగా లేక బాత్‌రూం తలుపులు లేనిపరిస్థితి నెలకొందన్నారు. శాశ్వత భవనాలు నిర్మించకుండా అద్దెలకు రూ. కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వ సొంత భవనాలు నిర్మిం చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మెను ప్రకారం భోజనం ఇవ్వడం లేదని విద్యార్థుల చేత వంట పనులు చేయిస్తున్నారని ప్రత్యేక కేర్‌టేకర్ లేక అధ్యాపకులే కేర్ టేకర్‌లుగా ఉండాల్సి న పరిస్థితినెలకొందన్నారు. అదేవిదంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి వాటిలో పాములు, పురుగులు, ఎలుకలు తిరుగుతుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఈ సమస్యలపై తక్షణమే ముఖ్యమంత్రి గురుకులాలపై స్పందించి చర్యలు చేపట్టాలని సొంత భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అభినవ్, నవీన్, నవదీప్, కిషోర్, రఘు, సాయిబాబా తధితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లోని మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించిన మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణగౌడ్. బోనంతో వచ్చిన జోగిని శ్యామల

# ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ తల్లికి పూజలు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**సంజీవరెడ్డి నగర్, జూలై 14, ప్రభాతవార్త**

బల్కంపేట్ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో బారుల తీరిన క్యూ లైన్లతో భక్తులు ఎల్లమ్మ తల్లిని వేలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి కళ్యాణోత్సవం అనంతరం ఆషాఢమాసం ఆదివారం రావడంతో వేలాదిగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా మూలవిరాట్ అమ్మ వారిని వివిధరకాల పువ్వులు, తులసిమాల తోరణా లతో, పట్టువస్త్రాలతో అమ్మవారిని అలంకరించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో అంజనీదేవి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్‌లు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో వేలాదిగా తరలిరావడంతో ఆల యంలోని పోచమ్మ, నాగదేవతల నుండి అమ్మవారి పవళింపు సేవల సైడ్ వెళ్లే ద్వారంను మూసివేసి భక్తుల సౌకర్యార్థం దర్శనం అనంతరం నేరుగా పడమర దిశలో ఉన్న ద్వారం ద్వారా బయటకు వచ్చిన తర్వాత ఎడమవైపుకు వచ్చి దక్షిణం వైపుగా ఉన్న షెడ్డులో లోపలికి వెళ్లే మార్గం ద్వారా పవ ళింపు సేవ అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాల కౌంటర్ నుంచి బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు. క్యూలైన్‌లలో ఉన్న భక్తు లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసు కుంటూ అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఆలయ సిబ్బందితో కలిసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరింటెండెంట్లు రంగు రమేష్, హైమవతి, మాజీ పాలకమండలి సభ్యులు కూతరు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన ఈటెల రాజేందర్

## కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎంపి ఈటల

**పేట్‌బషీరాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి దండముడి ఎన్‌క్లేవ్ వద్ద ఆదిత్య విల్లా క్లబ్ కమ్యూనిటీ హాల్‌ను పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్.భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీ నర్సింహ, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్య దర్శి చెరుకుపల్లి భరత్‌సింహరెడ్డిలతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్య క్రమంలో ఆదిత్య విల్లా చైర్మన్ వి.భాస్కర్‌రెడ్డి, ఎ.వెంకటరమణ, ఎన్.జగ న్మోహన్‌రెడ్డి, వి.రాజశేఖర్‌రెడ్డి, ఎ.సుధాకర్‌రెడ్డి, ఎం.వి.ఎల్ ప్రసాద్, భాస్కర్‌రావు, నిర్మల్ అగర్వాల్, లీలా, గిరివర్ధన్‌రెడ్డి, కట్ట కుమార్, వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాజు, యశ్వంత్, శ్రీకాంత్‌రెడ్డి, వర్మ, ఈశ్వర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌డిఎఫ్, హెచ్ఎండిఎ నిధుల నిలిపివేతతో

## అభివృద్ధి పనులకు ఆటంకం: సబితాఇంద్రారెడ్డి



కాలనీల్లో సమస్యలు తెలుసుకుంటున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో మంజూరైన ఎస్‌డిఎఫ్, హెచ్ఎండిఎ నిధుల నిలిపివేత వల్ల మహేశ్వరం నియోజక వర్గంలో అభివృద్ధి పనులు పూర్తికాలేని పరిస్థితి ఉందనీ ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆదివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని తిరుమలనగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఫేజ్-3 కాలనీలో రామిడి కళావతి స్మారక భవన మొదటి అంతస్తును ప్రారంభించారు. అనంతరం ఫేజ్ 1,2,3 కాలనీల్లో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాలనీల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేశామనీ అయితే గత ప్రభుత్వంలో మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ అదే విధంగా హెచ్ఎండిఎ నిధులు ఈ ప్రభుత్వంలో విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్నదని తెలిపారు. రాజకీయాల కతీతంగా అభివృద్ధి జరగాల్సి న అవసరం ఉందనీ ప్రజల సమస్యల పరి ష్కారం, అభివృద్ధి పనుల పూర్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రామిడి కవితా రాంరెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, భాగ్యనగర్ సొసైటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, రామిడి తూఫాన్‌రెడ్డిలతో పాటు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## సిఎంకు మేయర్ సన్మానం



సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లష్కర్‌గూడ లో ఆదివారం కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సన్మానం చేశారు. సభలో సిఎంను కలిసిన ఆమె శాలువాతో సత్కరించారు.

**బోనాల సందర్భంగా రోడ్లకు మరమ్మతులు...**

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొ రేషన్‌లోని 31వ డివిజన్‌లోని బాలాజీనగర్, గ్రీన్ రిచ్, శ్రీ విద్యాటౌన్‌షిప్ కాలనీల్లో ఆదివారం స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా బోనాల పండుగ సందర్భంగా చేపట్టాల్సి న పనులను పరిశీలించారు. ఈ మేరకు ఆమె అమ్మవారి ఆలయాలను, రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిగిరింత నర్సింహారెడ్డి, పెద్ద బావి సుదర్శన్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, నారా యణగౌడ్, లోక్మారెడ్డి, శ్రవణ్‌కుమార్ యాదవ్, గోపాల్, రవీందర్‌రెడ్డి, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సేల్స్‌మ్యాన్ మృతి

### ప్రమాదానికి కారుకుడైన వ్యక్తి అరెస్ట్

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 14 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఓ సేల్స్ మేన్ మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ నాయుడు కథనం ప్రకారం... లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన ఎమ్.నరేందర్ (36) వృత్తి రీత్యా సేల్స్ మేన్. ఈ నెల 13వ తేదీ శనివారం అర్ధరాత్రి నరేంద్ర ద్విచక్ర వాహనంపై కాటేదాన్ నుంచి ఆదర్శనగర్ వైపు వెళుతున్నాడు.హసన్‌నగర్‌కు చెందిన ఖయ్యుముద్దీన్ కాటేదాన్‌లోని ఓషాపులో పని చేస్తున్నాడు. కాగా నరేందర్ కాటేదాన్‌లోని స్వప్న థియేటర్ వెనుక ఉన్న ప్రాంతానికి చేరుకున్న సమ యంలో ఖయ్యుముద్దీన్ ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చాడు.నరేందర్ ద్విచక్ర వాహనాన్ని ఖయ్యుముద్దీన్ తన వాహనంతో ఢీకొట్టారు.ఈ సంఘ టనలో కింద పడిపోయిన నరేందర్ తలకు బలమైన గాయం కావటంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నరేందర్ మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు నరేందర్ మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరేంద్రకు భార్య,ఇద్దరు పిల్లలు కలరు.ఖయ్యుముద్దీన్‌ను పోలీసులు అదుపులోకీ తీసుకున్నారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 238 మంది పట్టివేత

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** డ్రంక్ ఎండ్ డ్రైవ్ పరీక్షల్లో రెండు రోజుల వ్యవధిలో 238 మంది మందుబాబులు పట్టుబడ్డారు. ఈ నెల 12, 13వ తేదీల్లో తాగి వాహనం నడుపుతూ సైబరాబాద్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. వీరిలో 184 మంది ద్విచక్రవాహనదారులు, 13 మంది ఆటో డ్రైవర్లు, 39 మంది కార్, వ్యాన్, బస్సు వంటి ఫోర్‌వీలర్ డ్రైవర్లు, ఇద్దరు హెవీ వెహికిల్ డ్రైవర్లు ఉన్నారు. అంతే కాకుండా వీరిలో 21 మంది రక్తంలో ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ 200 ఎంజీ నుంచి 550 ఎంజీ వరకూ నమోదయింది. వీరందరినీ అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, డ్రంక్ ఎండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు.

## తుర్కపల్లి బస్టాప్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

**శామీర్‌పేట, జూలై 14, ప్రభాతవార్త**

తుర్కపల్లి బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న తుర్కపల్లి బస్‌స్టాప్ వద్ద ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారని పోలీసులు తెలిపారు. వెంటనే బస్టాప్ వద్దకు పోలీసులు చేరుకోగా ఓ వ్యక్తి మృతచెంది ఉన్నట్లు గుర్తించారు. మృతిచెందిన వ్యక్తి 60నుంచి65సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని అన్నారు. అయితే పోలీసులు విచారణ చేయగ తుర్కపల్లి బస్టాప్ వద్ద ఆ వ్యక్తి బిక్షాటన చేస్తూ జీవించేవారని అన్నారు. రాత్రి సమయంలో బస్టాండ్‌లోనే నిద్రించే స్థానికులు వారని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతోనో, ఇతర కారణాల వల్ల మృతిచెంది ఉండవచ్చుని భావిస్తున్నట్లు తెలిపారు. తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎండిపోతున్న మొక్కలు-పట్టించుకునేవారుకరువు

**పుల్కల్, జూలై 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన దశాబ్ది సంపద వనంలో నాటిన మొక్కలను సంరక్షించుకునే వారు లేక ఎండుముఖం పడుతున్నాయి. గత ఏడాది వర్షాకాలంలో సంపద వనాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. వనంలో నాటిన మొక్కలకు సంరక్షణ కరువవడంతో (వనంలో పచ్చిమొక్కలు చెత్తాచెదారం) నీరు పారించకపోవడం, పిచ్చి మొక్కలను తొలగించకవడం, ఎండి పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటకపోవడంతో వనం అపరిశుభ్రంగా మారింది. సింగూరు ప్రాజెక్టును తిలకించేందుకు నిత్యం పర్యాటకులు వందల సంఖ్యలో వస్తూ ఉంటారు. పర్యాటక ప్రాంతంలో మొక్కలు ఎండిపోవడాన్ని చూసిన పర్యాటకులు అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సంపద వనంలో ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి, వనం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వర్షానికి కూలిన ఇళ్లు



**జిల్లెడు చౌదరిగూడ, జులై 14,(ప్రభాత వార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డి ఇళ్లు వర్షానికి కూలిపోయింది. రాంచంద్రారెడ్డి ప్రస్తుతం ఈ ఇంట్లో ఉండడంలేదు తాను నూతనంగ ఏర్పాటు చేసుకున్న ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అయితే రాం చంద్రారెడ్డి పాత ఇళ్లు కూలి పోవడం వల్లన ఇంటి పరిసరప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు గోడలు కూలి తమపై పడుతున్నాయని ఇళ్లను పూర్తిగా కూల్చివేయాలని పంచాయితి కార్యదర్శికి తెలిపినట్లు చుట్టుపక్కన ఉన్న వారు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఇళ్లను పూర్తి స్థాయిలో కూల్చివేయాలని కోరుతున్నారు.



రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మన్ నగరి ప్రీతమ్‌ను శామీర్‌పేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి అభినందనలు తెలిపిన దృశ్యం

## ఎస్సీకార్పొరేషన్ నూతన చైర్మన్‌ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

**శామీర్‌పేట, జూలై 14, ప్రభాతవార్త**

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మన్ నగరి ప్రీతమ్‌ను శామీర్‌పేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఆదివారం శామీర్‌పేట మండలం నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి రాష్ట్ర ఎస్సీకార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నగరి ప్రీతమ్‌ను మర్యాద పూర్వకంగ ఆయన నివాసంకు వెళ్లి కలిసి శాలువాలతో సన్మానించి సత్కరించి శుభాభినందనలు తెలియజేశారు. ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మన్ నగరి ప్రీతమ్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో దళితులకు (ఎస్సీలకు) న్యాయం జరుగుతుందని, ఎస్సీలు ఆర్థికంగ ఎదగటానికి చేయూత నందిస్తారని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన చైర్మన్‌ను కలిసిన వారిలో శామీర్‌పేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుంకి మల్లేశ్, తుంకి బిక్షపతి, తుంకి రమేశ్, కుడుముల వెంకటేశ, వినోద్‌కుమార్, బిఎన్ రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన మున్నూరుకాపు సంఘం నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసిన మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవాధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్, పలువురు సంఘం నాయకులు

**శామీర్‌పేట, జూలై 14, ప్రభాతవార్త**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఇటీవలనే బాధ్యతలు చేపట్టిన సందర్భంగ మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆదివారం శామీర్‌పేట మండలం నుంచి జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు కరీంనగర్‌లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంకు వెళ్లారు. ఆయనను మర్యాదపూర్వకంగ కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవాధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా అవసరాలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని నాయకులకు సూచించారు. నాయకులు ప్రజల్లో ఉండాలని నాయకత్వ లక్షణాంను పెంచుకోవాలని ఆయన సూచించారు. సంఘంతో పాటు ప్రజలకు సేవలు అందించటానికి కృషి చేయాలని కేంద్ర మంత్రి సూచించారు. దీనిలో జిల్లా గౌరవాధ్యక్షునితో పాటు రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు,కుత్బుల్లాపూర్ సదానందం, రాజ్‌కుమార్, నర్సింగ్, నవీన్, మున్నూరుకాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థలం తప్పుడు అగ్రిమెంట్ కేసులో ఇద్దరు రిమాండ్

### పరారీలో మరో ఇద్దరు నిందితులు

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:** ప్లాట్ యాజమాని నుంచి తాము అగ్రిమెంట్ చేసుకు న్నామని ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకొని మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చే యగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.



కేశవనగర్ ప్లాట్ కేసులో రిమాండ్ చేసిన నిందితులు

ఘట్‌కేసర్ మున్సిపల్ కేశవ నగర్ వెంచర్‌లో ఓప్లాటును యాజమాని నుంచి తాము అగ్రిమెంట్ చేసుకున్నామని ఎదులాబాద్‌కు చెందిన మీరాల గణేశ్, ఘట్‌కేసర్ బుగ్గానగర్‌కు చెందిన పల్లపు మహేశ్, మక్కల శ్రీకాంత్, బీబీనగర్ మండలం వెంకిర్యాలకు చెందిన యాకరి గణేశ్‌లు చౌదరిగూడకు చెందిన గొట్టిపాముల సుధర్శన్ అనే వ్యక్తిని నమ్మించి అతని నుంచి రూ.9.80 లక్షలు ప్లాట్ కొనుగోలుకు అడ్వాన్సుగా తీసుకొని అగ్రిమెంట్ చేసుకున్నారు. ప్లాట్లు రిజి స్ట్రేషన్ చేయాలని సుదర్శణ్ పలు సార్లు కోరగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ దాటవేస్తుండగా సుదర్శన్ విచారణ చేయగా నలుగురు వ్యక్తులు అసలు యాజమాని నుంచి ఏలాంటి అగ్రిమెంట్ పొందలేదని మోసపూరితంగా తనకు తప్పుడు అగ్రిమెంట్ ఇచ్చారని తెలుసుకున్నారు. తన వద్ద తీసుకున్న రూ.9.80 లక్షలు తిరిగి ఇవ్వాలని కోరగా నలుగురు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో బాధితుడు సుదర్శణ్ ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈమేరకు విచారణ జరిపి నలు గురిపై కేసు నమోదు చేసి నిందితులు మీరాల గణేశ్, పల్లపు మహేశ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేశామని మరో ఇద్దరు నిందితులు మక్కల శ్రీకాంత్, యాకరి గణేశ్‌ల పరారీలో ఉండటంతో వారి కోసం గాలిస్తున్నామని సీఐ సైదులు తెలిపారు.

# కబ్జా కోరల్లో కోటపల్లి ప్రాజెక్టు కాలువలు

**మరమ్మత్తులకు నోచుకోక వృథాగా సాగు నీరు**
**తగ్గుతున్న సాగు విస్తీర్ణం.. ఆందోళనలో ఆయకట్టుదారులు**
**చోద్యం చూస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు**



కోటపల్లి ప్రాజెక్టు

**పెద్దేముల్, జూలై 14, ప్రభాతవార్త:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అతిపెద్ద మధ్యతరహ ప్రాజెక్టు కోటపల్లి ప్రాజెక్టు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థం 24 అడుగులు. ప్రాజెక్టు ఆయకట్టు కింద 9200 ఎకరాల భూములు ఉన్నాయి. కోటపల్లి ప్రాజెక్టు ద్వారా మండలంలోని పెద్దేముల్, మారెపల్లి, మంబాపూర్, దుగ్గాపూర్, మన్‌సాన్‌పల్లి, రెగొండి, రుక్మాపూర్, జనగాం, బండపల్లి, ఖానాపూర్, ధారురు మండలంలోని గట్టెపల్లి, రుద్రారం, నాగసమందర్, అల్లాపూర్ తదితర గ్రామాల ఆయకట్టు భూములకు సాగు నీరందేది. ప్రాజెక్టు కాలువలపై ఎప్పటికప్పుడు సంబందిత అధికారులుపర్యవేక్షిస్తు పంట పోలాలకు నీటిని వదిలేవారు. అయితే సంబందిత నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలోపంతో అక్కడక్కడ ప్రాజెక్టు కాలువలను కబ్జా చేసుకుంటున్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ ద్వారా భూములకు విపరీతమైన డిమాండ్ రావడంతో కొందరు ఏకంగా కాలువలను మూసివేసి కబ్జా చేసుకొని భూములను అమ్ముకుంటున్నారు. అక్కడక్కడ కాలువలపై అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న పట్టించుకునేవారే కరువయ్యారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలువలు, తూములు, షట్టర్లు మరమ్మత్తులకు నోచుకోక సాగునీరంతా మన్‌సాన్‌పల్లి, నాగసమందర్ వాగులలో కలిసి వృథాగా పోతోంది. సాగునీరంతా వృథాగా పోవడంతో చివరి ఆయకట్టు భూములకు నీరందక పంటలు ఎండిపోయిన విషయము తెలిసిందే. 9200 ఎకరాలకు సాగు నీరందవలసిన ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం 4000 ఎకరాలకే సాగు నీరందుతోంది. దీంతో ఇంతకింతకు సాగు విస్తీర్ణం తగ్గుతుండటంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నా రు. గతంలో ప్రాజెక్టు ద్వారా 9200 ఎకరాలకు సాగు నీరందడంతో ఆయకట్టు భూములు పచ్చగా కళకళలాడుతు సస్యశ్యామలంగా కనిపించేవి. అయితే ప్రస్తుతం సాగు నీరందకపోవడంతో ఇంతకింతకు విస్తీర్ణం తగ్గి ఆయకట్టు



శిథిలావస్థకు చేరిన కాలువ



కాలువలపై అక్రమ నిర్మాణాల దృశ్యం

భూములు ఎడారిని తలపిస్తున్నాయి. ఇంత తతంగం జరుగుతున్న సంబందిత నీటి పారుదల శాఖ అధికారుల జాడ కనిపించడంలేదు.కబ్జాకు గురవుతున్న ప్రాజెక్టు కాలువలను కబ్జా కోరల నుంచి విడిపించి, కాలువల మరమ్మత్తులను చేపట్టి కోటపల్లి ప్రాజెక్టు పూర్వవైభవం సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## చైన్‌స్నాచర్ రిమాండ్

### బంగారు, వెండి ఆభరణాలు పట్టివేత

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త :** ఓ వ్యక్తి నుంచి బంగారు, వెండి గొలుసులు లాక్కెళ్లిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన మెకానిక్ పంది ధనంజయ ఈనెల 12న ఘట్‌కేసర్‌లో తన బంధువైన బుడ్డ బాలయ్య ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. శుక్రవారం సాయంత్రం ఎదులాబాద్ రోడ్డులో కూరగాయల సంతకు వచ్చి కొనుగోలు చేస్తుండగా వర్షం రావడంతో ధనుంజయ పశువుల వైద్యశాల పక్కన నిలబడి ఉండగా సాయంత్రం 7:20 గంటల సమయంలో ఘట్‌కేసర్ మున్సిపల్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన అజ్మీరా వెంకటేశ్ (25) అకస్మాత్తుగా వచ్చి ఏలాంటి కారణం లేకుండా ధనుంజయతో గొడవపెట్టుకొని అతని మెడలో ఉన్న బంగారు, వెండి గొలుసులను లాక్కుని అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో బాధితుడు ధనుంజయ ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తూ వెంకటేశ్ కోసం గాలింపు జరిపారు. నిందితుడు అజ్మీరా వెంకటేశ్ ఇంటి వద్ద ఉన్నాడన్న సమాచారంతో ఘట్‌కేసర్ క్రైమ్ సిబ్బంది వెళ్లి అతన్ని పట్టుకొని విచారించగా ధనుంజయ బంగారు, వెండి గొలుసులు లాక్కున్నానని తన ఇంట్లో ఫ్రిడ్జ్‌లో కవర్లో చుట్టు పెట్టినట్లు తెలియజేయడంతో పోలీసులు విడియోగ్రాఫ్ ద్వారా స్వాధీనం చేసుకొని నిందితుడు వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సైదులు తెలిపారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి నినాదాలు చేస్తున్న నాయకులు

## యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 170వ వారం నిత్య పూల మాళ కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘట్‌కేసర్ బుడగ జంగం సంక్షేమ సంఘం కార్యదర్శి కొంపల్లి నాగులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొంపల్లి నర్సింహ్మా, కొండపల్లి శ్రీను, పతి శంకర్‌లు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. బుధుడు, అశోకుడు, జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే, చత్రపతి సాహుమహారాజ్, నారాయణగురు, పెరియార్ రామస్వామి ఆశయాలకు కృషి చేయాలని వారు కోరారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని అంటరానితం నివారణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని తెలిపారు. ఈసందర్భంగా రాజ్యాంగపీఠికపై ప్రమాణం చేసి పుస్తకాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, ప్రధాన కార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు బండారు రాందాసు, నర్సింగ్‌రావు, కళ్లెం అంజనేయులు, రాజేశ్‌కుమార్, సత్యం, గంగారాం, అంజనేయులు, తృప్తి దుర్గ, వై.వెంకటేశ ర్లు, సి.సంజయ్‌కుమార్, ఉపేందర్, విష్ణు, సచిన్, రామారావు, ప్రవీణ్, సాయిచరణ్, అఖిల్, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడలో ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి కార్యక్రమం ఉండటంతో బిజెపి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఘట్‌కేసర్ మం డలం ఎదులాబాద్‌లో ఆదివారం ఉదయం బిజెవైఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని ఘట్‌కేసర్ పోలీసులు అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, నిర్భంధాలతో ఉద ్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. సీఎం పర్యటన ఉంటే బిజెవైఎం నాయకులను ఎందుకు ఆరెస్టు చేయడం సరికాదని అక్రమ అరెస్ట్ చేసి పోలీసులు తమను ఇబ్బందులు గురి చేయడం తగదని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



బిజెవైఎం జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

## సంస్కృతి టౌన్‌షిప్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 14, ప్రభాత వార్త:** పది గంటలకు పది నిముషాలు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్‌లో స్థానిక కౌన్సిలర్, టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. హరిప్రసాద్‌రావు చెత్తను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాడు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు మున్సిపల్ కౌన్సిలర్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలనీలో పలుచోట్ల పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేందుకు మున్సిపల్, టౌన్‌షిప్ పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కౌన్సిలర్ కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సంస్కృతి టౌన్‌షిప్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగిస్తున్న కౌన్సిలర్ బి. హరిప్రసాద్‌రావు

## తండ్రిని కొట్టిన తనయుడిపై కేసు నమోదు

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:** తండ్రిని కొట్టిన తనయుడిపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు. ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్‌కు చెందిన చింతకింది శంకరయ్య తార్‌నాకలోని ఎన్ఐఎన్‌లో ఉద్యోగం చేసి 2018 సంవత్సరంలో రిటైర్డ్ అయ్యారు. శంకరయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉండగా అందరి వివాహాలు చేశారు. శంకరయ్య అతని భార్య లక్ష్మిలు కలిసి తమ ఇంట్లో ఉంటున్నారు. గత కొన్ని రోజులుగా పెద్ద కుమారుడు చింతకింద వేణుగోపాల్ (44) డబ్బుల కోసం తండ్రితో తరచుగా గొడవపడుతే వేధించసాగాడు. ఈనెల 13న సాయంత్రం 7 గంటలకు వేణుగోపాల్ తండ్రి శంకరయ్య ఇంటికి వచ్చి తిడుతూ కాళ్లతో తన్ని కొట్టారని తెలిపారు. బాధితుడు శంకరయ్య ఆదివారం ఉదయం 7 గంటలకు అతని సోదరుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లగా గొడవను తెలియజేయగా వేణుగోపాల్ ఆఇంటికి కూడా వచ్చి కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి ఎస్ఐ బి.శ్రీకాంత్ దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సైదులు తెలిపారు.

## మూసి ఉన్న కిరాణాషాప్‌లో దొంగతనం

**పెద్దేముల్,జులై14,ప్రభాతవార్త :** పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో మూసి ఉన్న కిరణంషాపులో దొంగతనం జరిగింది.ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం జనగాం గ్రామానికి చెందిన చాకలిబాల్‌రాజ్ వయస్సు(28) తండ్రి నారాయణ పాఠశాలకు సమీపంలో శ్రీ వెంకటేశ్వర కిరాణంషాపు ఉంది.శనివారం రాత్రి 9గంటల సమయంలో షాపును మూసివేసి తన ఇంటికి వెళ్ళిపోయాడు.ఎప్పటిలాగే ఆదివారం ఉదయం 6గంటల సమయంలో షాప్‌ను షాపు వెనకభాగంలో ఉన్న స్క్రూలు ఓపెన్ చేసి ఉన్నాయి.షాపులో 2500రూపాయాలు,10లీటర్ల డిజీల్, బిస్కెట్ పాకెట్స్ కనబడటంలేదు.వాటి విలువ 6500 రూపాయాల వరకు ఉంటుందని తెలిపారు.ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం పాల్పడి ఉండవచ్చని ఈ విషయంలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

## పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం చేసిన దృశ్యం

**కొడంగల్,జులై14,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే ఆర్ గురునాథ్‌రెడ్డి నూతనంగా ఎన్నికైన సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మురారి వాసిష్టా,మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉషారాణి,మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం గౌసన్ పూలమాల,శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మిఠాయి రాజు,సాకేత్,మైనార్టీ అధ్యక్షులు ఆసిఫ్‌ఖాన్, టౌన్‌ప్రెసిడెంట్ సయ్యద్ హమీద్,హఫీజ్ అదిల్, వాహేద్‌రజా, హైమత్‌ఖాన్, నూర్‌ఖాన్, ఖదీర్,రహీం, మహెబూబ్, సాబీర్, రహీమాత్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మారెమ్మ పండుగ

**బొంరాస్‌పేట్,జులై14,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం మేడిచెటుతాండ గ్రామపంచాయతీ అనుబంధంగా ఉన్న బోడబం డతాండలో మారెమ్మ(సీతల) పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు.పూర్వికుల నుండి వస్తున్న సంప్రదాయం ప్రకారం బంజార సోదరులు ఈ పండుగను కొనసాగిస్తున్నమన్నారు.సీతల పండుగ వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పశుసంపద వృద్ధిచెందాలని కోరుకుంటు పండుగను నిర్వహంచడం జరుగుతుందని తాండప్రజలు తెలిపారు. లక్ష్మణ్‌నాయక్, గ్రామపెద్దలు, యువకులు,మహిళాలు పాల్గొన్నారు.



మారెమ్మ పండుగను నిర్వహిస్తున్న గిరిజనులు

## టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

### గంజాయి స్వాధీనం .. ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

**పూడూరు, జూలై 14, ప్రభాతవార్త :** గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో చోటు చేసుకుంది.జిల్లా మధ్యనిషేద,ఆబ్కారీ శాఖకు అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం, మీర్జాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆసిఫ్ ఇంటిపై దాడి నిర్వహించి ఇంట్లోఉన్న 300గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు ఆసిఫ్ ఇచ్చిన సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన మొల్ల షేర్ఖాన్ ఇంటిపై దాడిచేసి 300గ్రాముల ఎండు గంజాయి,150 గ్రాముల గంజాయి విత్తనాలను స్వాదీనం చేసుకున్నారు.ఈ మేరకు కేసునమోదు చేసుకొని మమ్మద్ ఆసీఫ్,మొల్ల షేర్ఖాన్‌లను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి కె శ్రీనివాస్ తెలిపారు. ఇట్టిదాడిలో ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి,సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి,హనుమంతు, శివప్రసాద్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నట్లు వివరించారు.

## అన్నోజిగూడలో ఆగస్టు 4న బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాల కొరకు ఏర్పాటు చేసిన గ్రామ పెద్దల సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న చైర్మన్ బి.కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 14, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో తెలంగాణ సంస్కతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ఆగస్టు 4 వ తేదిన నిర్వహించాలని గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించినట్లు చైర్మన్ బి. కొండల్ రెడ్డి తెలిపారు. ఆదివారం అన్నోజిగూడ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలు సమావేశమై నిర్ణయించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు నల్లవెల్లి శేఖర్, పి. వెంకటస్వామి గౌడ్, ఎన్. రమేశ్ ముదిరాజ్, దానయ్య గౌడ్, ఆల్వల దర్శన్ గౌడ్, కొంతం శంకర్ రెడ్డి, బాలగోని శంకర్ గౌడ్, యంజాల బాస్కర్, రాధారం శ్రీశైలం, పెంటయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 14, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని సాయి గణేశ్‌నగర్‌లో ఆదివారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా చైర్మన్ బి. కొండల్ రెడ్డి పర్యటించి సమస్యలను అడిగితెలుసుకున్నారు. సాయి గణేశ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు చైర్మన్‌కు వినతి పత్రం అంజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు స్థానిక నాయకులు కృష్ణా నాయక్, గణేశ్, బుచ్చిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### పోచారం మున్సిపల్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా బంధం కుంటలో దోమల నివారణకు ఆయిల్‌బాల్స్‌ను చైర్మన్ బి. కొండల్ రెడ్డి వేశారు. అనంతరం పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి రోగాలు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో నీటినిల్వ ఉండకుండా చూడాలని చైర్మన్ అన్నారు. కొబ్బరిచిప్పలు, మొక్కల నీటితొట్టిల్లో, టైర్లలో నీరు నిల్వఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ కొండల్ రెడ్డి పర్యటించగా సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం